ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గ పాలక్ అప్పాల గణేష్ చక్రవర్తి
- పెర్కిట్‌లో నియోజకవర్గస్థాయి బూత్‌కమిటీ సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గ పాలక్ అప్పాల గణేష్ చక్రవర్తి

పెర్కిట్(ఆర్మూర్): తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉండాలని బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గ పాలక్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. పెర్కిట్‌లో శనివారం బీజేపీ నియోజకవర్గ స్థాయి పోలింగ్ బూత్ కమిటి సభ్యుల సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనానికి గణేష్ చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీని బూత్ స్థాయిలో పటిష్టం చేసినపుడే రాష్ట్రంలో అధికారం సాధిస్తామన్నారు. తెలంగాణలో నియంతృత్వ పాలనకు చరమగీతం పాడడానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని దిశ నిర్దేశం చేశారు. నియోజకవర్గ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు లోక భూపతి రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, జీవీ నర్సింహ రెడ్డి, కంచెట్టి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో కాషాయ జెండా ఎగురవేస్తాం...

బోధన్: రాబోయే ఎన్నికల్లో బోధన్ సెగ్మెంట్‌పై కాషాయం జెండా ఎగురవేస్తామని బీజేపీ నియోజకవర్గ పాలక్ మల్లారెడ్డి అన్నారు. పట్టణ శివారులోని రవి గార్డెన్‌లో శనివారం బీజేపీ నియోజకవర్గ స్థాయి పోలింగ్‌బూత్ కమిటీ సభ్యుల మహా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో పార్టీ విజయానికి బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలే మూల స్తంభాలన్నారు. అనంతరం వర్చుల్ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల సందేశం ఇచ్చారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి, నాయకులు ప్రబారి నందారెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, శివప్ప, రామరాజు, కమలాకర్, సుక్క రాజు, అధినాత్, రెంజల్ ఎంపీపీ, జెడ్పీటీసీ రజినీ కిషోర్, విజయ సంతోష్ పాల్గొన్నారు.

బాల్కొండ నియోజకవర్గంలో..

కమ్మర్‌పల్లి: మండల కేంద్ర శివారులోని లలితా గార్డెన్స్‌లో శనివారం బీజేపీ బాల్కొండ నియోజకవర్గ బూత్ కమిటీ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. వర్చువల్ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ పాలక్ పవార్ రామారావు పటేల్, ప్రభారి కరండ్ల మధుకర్, డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డిలు హాజరై, మాట్లాడారు. పార్టీ సభ్యత్వం తీసుకొని సరళ్ యాప్ ఎలా ఉపయోగించాలో వివరించారు. డిజిటల్ సమాచారం ఎలా తెలుసుకోవాలి, విధి విధానాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ మల్కన్న గారి మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, కట్ట సంజీవ్, ఆయా మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో పేర్ల నమోదు ప్రక్రియను ప్రారంభించిన నియోజకవర్గ పాలక్ మల్లారెడ్డి.. బాల్కొండ బూత్ కమిటీ సమ్మేళనానికి హాజరైన బీజేపీ నాయకులు

క్లుప్తంగా

ఆసరా పింఛన్ల అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో నూతనంగా మంజూరైన ఆసరా పింఛన్లను సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఉప సర్పంచ్ శ్రీరామ్, వార్డు సభ్యులు మహేందర్, నల్లయ్య, గాంధీ, కారోబార్ యోగేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నలందలో గ్రాండ్ పేరెంట్స్‌డే



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో శనివారం గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్‌కు ఆటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ నలంద ప్రసాద్, ప్రిన్సిపాల్ నలంద సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ



రుద్రూర్: మోస్రాకు చెందిన బింగి స్రవంతికి శనివారం రూ. 2లక్షల బీమా చెక్కును స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. స్రవంతి భర్త లక్ష్మణ్ ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతుడికి బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉండటంతో పార్టీ బీమా పథకం కింద చెక్కును అందించారు. నాయకులు పిట్ల శ్రీరాములు, మండల కోఆప్షన్ సభ్యుడు ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారం



బోధన్‌రూరల్(బోధన్): పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించనందుకు గాను బోధన్ రూరల్ ఎస్సై సందీప్‌కు ఉత్తమ సేవ పురస్కారం దక్కింది. శనివారం సీపీ నాగరాజు అతడికి పురస్కారం అందజేశారు.

కూలీలకు టీషర్టుల పంపిణీ



రెంజల్(బోధన్): బీహార్ రాష్ట్రానికి చెందిన 60 మంది వలస కూలీలకు లయన్స్ క్లబ్ నిజామాబాద్ సహారా ఆధ్వర్యంలో టీషర్టులను పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి సూర్య భగవాన్, ఏరియా కో–ఆర్డినేటర్ ద్వారకాదాస్ అగర్వాల్, కోశాధికారి దనుంజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బషీరాబాద్ ఉన్నత పాఠశాలల్లో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టే మరుగుదొడ్ల నిర్మాణానికి ఎంఈవో ఆంధ్రయ్య భూమిపూజ నిర్వహించారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ యూనిట్‌లను ప్రారంభించారు. సర్పంచ్ అశోక్, ఎంపీటీసీలు సుధాకర్, జ్యోతి, అజ్మత్ హుస్సేన్, ఎస్ఎంసీ చైర్మన్ నీరడి సాయన్న, ఫౌండేషన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలో శనివారం మండల పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను మండల అధ్యక్షుడు చింత తిరుపతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి ధరణికుమార్, హాసాకొత్తూర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కుందారం శ్రావణ్‌కుమార్, సభ్యులు చిలివేరి మురళి, నాయిని పురుషోత్తం, పడాల వినాయక్‌కుమార్, ఈగ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

వేల్పూర్: మండలంలోని రామన్నపేట్‌లో గ్రామానికి చెందిన జెట్టి మల్లేష్ తన తండ్రి దివంగత జెట్టి మొండయ్య స్మారకార్థం కల్యాణ మండపాన్ని నిర్మించారు. శనివార కల్యాణ మండపాన్ని జెట్టి మల్లేష్, స్వప్న దంపతులు ప్రారంభించారు. సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, సొసైటి చైర్మన్ మోహన్‌రెడ్డి, శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రిప్టోగ్రఫీతోనే సమాచార భద్రత


మాట్లాడుతున్న టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా

పెర్కిట్(ఆర్మూర్): సమాచార భద్రతకు క్రిప్టోగ్రఫీ అతి కీలకమైనదని టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా అన్నారు. ఆర్మూర్ మండలం క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం క్రిప్టోగ్రఫీపై రెండు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దేశ రక్షణ వ్యవస్థ, బ్యాంకింగ్, ఆర్థిక, అంతరిక్ష రంగంలో సమాచారాన్ని భద్రపరచడానికి క్రిప్టోగ్రఫీని ఉపయోగిస్తున్నారన్నారు. క్రిప్టోగ్రఫీ నిపుణుడు మోతాహర్ రజా మాట్లాడుతూ.. గణితంలో రాణించే విద్యార్థులు క్రిప్టోగ్రఫీ సబ్జెక్టుపై నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, కార్యదర్శి దేవేందర్, డీఆర్‌డీవో సైంటిస్టు డాక్టర్ ఇండీవర్ గుప్తా, ప్రొఫెసర్ అమోగ్ కట్టి, ప్రిన్సిపల్ ఆర్‌కే పాండే పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు


దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

బోధన్: బోధన్‌ను ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 20వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, శంకర్, విద్యార్థి జేఏసీ ప్రతినిధి శివకుమార్ కూర్చున్నారు. మాజీ కౌన్సిలర్ రాజీవిఠల్, అంబేద్కర్ సంఘం ప్రతినిధి శంకర్ దీక్షలకు సంఘీబావం తెలిపారు. న్యాయవాదులు హన్మంత్‌రావు,ఈశ్వర్, అర్జున్ రాండర్,రమేష్, ధరయ్య, అడ్లూరి శ్రీనివాస్, అజయ్, శేఖర్‌లు పాల్గొన్నారు.

ఉల్లికోడు నివారణ చర్యలు చేపట్టాలి


వరిని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

రుద్రూర్: వరిలో ఉల్లికోడు నివారణకు చర్యలు పాటించాలని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్ కుమార్, రాజ్ కుమార్ పేర్కొన్నారు. వర్ని, రుద్రూర్, కోటగిరి మండలాల్లోని పంట పొలాలను శనివారం వారు సందర్శించారు. వరి పంటకు ఉల్లికోడు ఆశించినట్టుగా గుర్తించారు. ఈసందర్బంగా సస్యరక్షణ శాస్త్రవేత్త విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఉల్లికోడు ఆశించిన పొలాల్లో పిలుకలు ఎక్కువగా వేయక దిగుబడి తగ్గుతుందని, సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. నివారణకు ఫిప్రోనిల్ గుళికలు 0.3శాతం జీ, 8–10 కిలోలు చొప్పున ఎకరానికి (లేదా) 0.6%జీ 4కిలోలు ఎకరానికి చొప్పున వేసుకోవాలని సూచించారు. 25రోజులు పైబడిన వరి పొలం అయితే ఫిప్రోనిల్ 5% ఎస్.సీ 2.5 మి. లీ /లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా నివారించుకున్నట్లయితే రైతులకు పిలకల నష్టం జరగకుండా ఆశించిన దిగుబడిని పొందవచ్చని తెలిపారు.

వ్యవసాయ క్షేత్రం పరిశీలన



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం శనివారం ఎడపల్లి గ్రామీణ ప్రాంతాల నేపథ్యం, పంట పొలాల సాగుబడి, కూరగాయల సాగు తదితర అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆదర్శ రైతు పాపారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

నవీపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని నవీపేట, నాగేపూర్ గ్రామాలలో ఎమ్మెల్యే సతీమణి ఆయేషా పాతిమా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో మహిళలు, విద్యార్థినులు రంగురంగుల ముగ్గులను వేశారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులను అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ రజితయాదవ్, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జెడ్పీటీసీ నీరడి సవిత, ఎంపీడీవో సాజిద్ అలీ, సర్పంచులు ఆసొల్ల శ్రీనివాస్, స్వరూప, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావ్, న్యాలకంటి అబ్బన్న, దొంత ప్రవీన్, సాయికుమార్‌గౌడ్, లోకం నర్సయ్య పాల్గొన్నారు.

మన ఊరు-మన బడి పనుల పరిశీలన



రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్, బోర్గాం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మన ఊరు–మన బడి పనులను శనివారం పంచాయతీరాజ్ ఈఈ బావన్న, డీఈ రాజయ్యలు పరిశీలించారు. పనుల్లో పురోగతి సాధించాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీపడొద్దని సూచించారు. ఎంపీడీవో శంకర్, సాటాపూర్ సర్పంచ్ ఎఖార్‌పాష ఉన్నారు.

డీఎస్పీ సంతకాల సేకరణ



మాక్లూర్: విశారధన్ మహారాజ్ చేపట్టిన 10వేల కి.మీ పాదయాత్రకు మద్దతుగా శనివారం మండల కేంద్రంలో దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర కార్యదర్శి ప్రేమ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. స్వరాజ్య స్థాపన కోసం విశారధన్ మహారాజ్ పాదయాత్ర చేపట్టినట్టు వారు వెల్లడించారు. డీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాయిలు, సుమన్, దీపక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. జరిగిన సంతకాల సేకరణలో రెండు వందల మంది పాల్గొన్నట్లు వారు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం..

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన రాచర్ల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం అంత్యక్రియల కోసం ముప్కాల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భూమేశ్వర్ రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి



భీమ్‌గల్: మహిళా సంఘాల సభ్యులు రుణాలను సక్రమంగా చెల్లించాలని ఐకేపీ సీసీ పురస్తు నరేష్ పేర్కొన్నారు. మండలంలోని పురాణిపేట్ గ్రామంలో శనివారం ఆయన గ్రామ సమాఖ్య సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. బ్యాంక్, స్త్రీ నిధి రుణాలు ప్రతీ నెల సక్రమంగా చెల్లించాలని అన్నారు. పురాణి పేట్ గ్రామానికి 2022–23 సంవత్సరానికి రూ.2.5 కోట్లు ఇచ్చారని, ఈ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌బీఐ మేనేజర్ అశోక్, టీజీబీ మేనేజర్ సుదమ్, స్త్రీ నిధి మేనేజర్ సురేష్, వీఓఏ కృష్ణ సాగర్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహించాలి



ఆర్మూర్‌టౌన్: 18సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ భుజంగ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో కంటి వెలుగు కార్యక్రమంపై శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి, ఆశా వర్కర్లకు, ఏఎన్ఎంలకు అవగాహన నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ, గ్రామ స్థాయిలో కంటి వెలుగు క్యాంపులు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్ చంద్రశేఖర్, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ కోసం సంతకాల సేకరణ



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి రైల్వే స్టేషన్ల కోసం మండలంలోని పోచారం గ్రామంలో శనివారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు గుమ్మల గంగాధర్ శనివారం సంతకాల సేకరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలకు రైల్వే స్టేషన్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, రెండు స్టేషన్లను పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ నాయకులు షేక్ నసీర్, రవి, మండల నాయకులు సిద్ధ పోశెట్టి, గంగన్న గుడుసాబ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్టాండ్ పనులు ప్రారంభం



వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మాణ పనులను మండల టీఆర్ఎస్ నాయకులు శనివారం ప్రారంభించారు. ఎంపీపీ బీమ జమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి


బోధన్ ఆర్డీవో ఆఫీస్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోధన్: మండలంలోని ఖండ్‌గాం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి శ్రీకాంత్ హత్యకు కారకులైన ఐదుగురిని వెంటనే అరెస్టు చేయాలని మహారాష్ట్ర ప్రాంత శివ సంఘటన, అఖిల భారతీయ వీరశైవ లింగాయత్ సంఘటన ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏవో ముంతాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్బంగా సంఘటన నాయకులు మాట్లాడుతూ.. శ్రీకాంత్ మృతి ముమ్మాటికీ హత్యేనని అందరికి తెలిసినా.. పోలీసులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. కేసు విచారణను సీఐడీకి అప్పగించాలని కోరారు. ఈనెల 12వరకు చర్యలు తీసుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వెల్లడించారు. నాయకులు నాగనాథ్ పాటిల్,హన్మంత్ పాటిల్ తదితరులు ఉన్నారు.

నూతన చట్టాలపై అవగాహన


నూతన చట్టాల పై చర్చిస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి,డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నూతన చట్టాలపై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే నరేందర్, డివిజన్‌లోని సీఐ, ఎస్సైలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు చట్టాలపై కోర్టు ప్రొసీజర్, కొత్తగా వివిధ కోర్టుల చట్టాలు, రూలింగ్స్‌పై, కన్విక్షన్‌లపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్మూర్, ఆర్మూర్ రూరల్, భీంగల్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్: పట్టంలోని కోర్టులో శనివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు డివిజన్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాణి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్యలు కొత్త చట్టాలను వివరించారు.

వాహనాలను అతివేగంతో నడపొద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ నాగరాజు

మాక్లూర్: వాహనాలను అతివేగంగా నడపొద్దని, అతివేగం ప్రాణాలమీదికి తెస్తుందని సీపీ నాగరాజు అన్నారు. మండలంలోని దాస్‌నగర్ విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాహనదారులు సక్రమమైన డ్రైవింగ్‌తో పాటు హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ట్రాఫిక్ నిబంధలనలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



వర్ని: మండలంలోని వడ్డేపల్లి హనుమాన్ మందిరంలో శనివారం భక్తులు హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. ఆంజనేయ స్వామి జన్మదినం సందర్భంగా శనివారం పునర్వసు నక్షత్రం, పాడ్యమి కావడంతో ఇంద్రయోగ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని భక్తులు పారాయణం నిర్వహించారు. అయ్యప్ప, హనుమాన్ భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

నియామకం..

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా..

కమ్మర్‌పల్లి: పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండలంలోని హాసాకొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసమూర్తి, నర్సాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాధాకిషన్ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా కోనా సముందర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గణేష్, మండల అసోసియేటెడ్ అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అంజాద్ సుల్తాన్ తెలిపారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా..

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రుద్రూర్ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్ నియమితులయ్యారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బ్లాక్ కాంగ్రెస్ పదవికి నియామకం చేసినందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలోగల మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సయ్యద్ హైదర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు గల మిగులు సీట్లను బర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు పదో తరగతిలో సాధించిన జీపీఏ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు బోధన్ జీజేసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బోధన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం 1981–83 విద్యాసంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూప్‌ల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అప్పటి కళాశాల ప్రిన్సిపల్ అర్లయ్య, అధ్యాపకులు డాక్టర్ నాళేశ్వరం శంకర్, సత్తయ్య, కోటిరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, వీ. కృష్ణారావు, శంకర్‌రెడ్డిలు సమ్మేళనానికి విచ్చేస్తున్నారన్నారు. నిర్వహకులు, పూర్వ విద్యార్థులు మురళి కృష్ణ, చక్రవర్తి, కొలంబస్, శ్రీలక్ష్మి, సీతారాంలు సమ్మేళనానికి ఏర్పాట్లు చేస్తున్నాట్లు తెలిపారు.

నేడు వేల్పూర్‌లో 'కన్న ఊరు కార్యక్రమం'

వేల్పూర్: మండల కేంద్రంలో ఆదివారం 'కన్న ఊరు కార్యక్రమం' నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లాలోని 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 40మంది పేద విద్యార్థులకు 'కన్న ఊరు కార్యక్రమం' కింద సైకిళ్ల వితరణ చేయనున్నట్లు వారు వెల్లడించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూదన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776 & బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899